# దొంగతనాలు అంటకట్టి వేధిస్తున్నారు!

మా అక్క మొదటి నుంచీ నెమ్మదస్తురాలు. పెళ్లయిన నెల రోజుల నుంచే అత్తింటివారు వేధించడం మొదలుపెట్టారు. ముఖ్యంగా అత్త ప్రతి చిన్నదానికి నలుగురిలో అక్కని వేలెత్తి చూపించడానికి ప్రయత్నిస్తోంది. అంతేకాదు, విలువైన వస్తువులను అక్క బ్యాగులో, బట్టల మధ్య పెట్టి దొంగతనం చేసిందని ప్రచారం చేస్తోంది. వీటన్నింటి చూపించి అక్కని మాట్లాడనివ్వడంలేదు. ఇంటి చాకిరీ మొత్తం చేయిస్తోంది. మా బావ ఇవేమీ పట్టించుకోడు. ఆయనా అక్కను ఓ బానిసలా చూస్తున్నాడు. పాప పుట్టినా వాళ్లు మారలేదు. పైగా అక్కకి పిల్లల్ని పెంచడం రాదంటూ పాపను తాకనివ్వడంలేదు. మేం ఇప్పటికే చాలా సార్లు చెప్పి చూసినా ఉపయోగంలేదు. అక్కను తరచూ కొట్టడంతో ఈ మధ్య భయపడి పాపను తీసుకుని మా ఇంటికి వచ్చేసింది. నాలుగునెలలు అవుతోంది. బావ వాట్సాప్‌లో తిడుతూ, ఆడియో మెసేజ్‌లు పెడుతున్నాడు. ఇప్పుడు మేం న్యాయపరంగా చర్యలు తీసుకోవాలా లేక వేధింపుల కేస్ పెట్టాలా? రాజీ అయ్యి కాపురానికి పంపించాలా?

\- ఓ సోదరి

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org




మీ అక్కని కొట్టడం, తిట్టడం అనేది గృహహింస కిందకి వస్తుంది. ఆ బాధలు భరించలేక మీ అక్క పుట్టింటికి వచ్చేసింది అని చెప్తున్నారు. అలాంటప్పుడు ఏ ధైర్యంతో మళ్లీ అక్కడికి పంపిస్తారు. తిరిగి పంపాలంటే ముందు మీ బావ, అత్త, మామల్ని మధ్యవర్తుల దగ్గర కూర్చోబెట్టి మాట్లాడండి. బాగా చూసుకుంటాం అని రాసిస్తేనే పంపించడం మంచిది. అలానే మీ అక్క మళ్లీ అత్తింటికి వెళ్లినా కూడా అన్ని పరిస్థితుల్లోనూ ఆమెకు తోడుగా ఉంటామనే భరోసా ఇవ్వండి. తొందర పడి ఏమీ చేసుకోకుండా ఆమెకు శారీరక, మానసిక భద్రత కల్పించడానికి మీరు, మధ్యవర్తులు సిద్ధంగా ఉండాలి. ఒకవేళ మీ అక్కకి తిరిగి అక్కడికి వెళ్లే ఉద్దేశం లేకపోతే గృహహింస చట్టం కింద కేసు పెట్టొచ్చు. దాని కింద సెక్షన్ 18, 19, 20, 21, 22 కింద ప్రొటెక్షన్, మెయింటెనెన్స్, వైద్య ఖర్చులు, రెసిడెన్స్ ఆర్డర్, నష్టపరిహారం లాంటివి కోర్టుని కోరవచ్చు. ఇవన్నీ మీ అత్తింటి వారి దగ్గర నుంచి పొందాలంటే అత్తింటి ఆర్థిక స్థోమత, భర్త జీతభత్యాల వివరాలు కోర్టుకి తెలియచేయాలి. అలానే మీ అక్క అనుభవించిన శారీరక, మానసిక బాధ అంతా కోర్టువారికి నివేదించాలి. ఇద్దరి వాదనలు విన్న తరువాత కోర్టు మీ అక్కకి ఇవ్వగలిగిన వాటిని నిర్ణయిస్తుంది.

డీవీసీ కేసులో విడాకుల ప్రసక్తే లేదు. కాబట్టి ఇవి అన్నీ పొందిన తరువాత వాళ్ల ప్రవర్తన బట్టి మీ అక్క వారితో ఉండాలా లేదా విడాకులు తీసుకోవాలా అనేది నిర్ణయించుకోవచ్చు. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం విడాకుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దానిలోనే సెక్షన్ 24 కింద మెయింటెనెన్స్ సెక్షన్ 25 కింద శాశ్వత భరణం కూడా అడగొచ్చు. పాప ప్రస్తుతం మీ అక్కతోనే ఉంది కాబట్టి కస్టడీ కోసం ప్రత్యేకంగా కేసు వేయాల్సిన అవసరం లేదు. సెక్షన్ 498ఎ కింద వరకట్నం వేధింపులపై కూడా పోలీస్‌స్టేషన్‌లో కంప్లయింట్ చేస్తే వాళ్లు దాన్ని కోర్టులో సీసీ కింద నమోదు చేస్తారు. పోలీసులు అతడిని పిలిచి కౌన్సెలింగ్ చేస్తారు. ఒకవేళ ఆ సమయంలో అతడు మారతానని నమ్మకం ఇస్తే మీరు కేసు విత్‌డ్రా చేసుకోవచ్చు. లేకపోతే పోలీసులు అతడిని అరెస్ట్ చేస్తారు. ఏదైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడమే మంచిది. ఫ్యామిలీ కోర్టులో కేస్ వేసినా, డీవీసీ కేసు వేసినా, ముందుగా మధ్యవర్తుల దగ్గరికే పంపుతారు. అప్పుడు అన్నీ వివరంగా చెప్పండి. మీ బావ, అత్త మారతారని పూర్తిగా నమ్మకం కలిగితేనే కాపురానికి పంపండి. మళ్లీ వేధింపులకు గురిచేస్తే పైన చెప్పినవి చేయండి.